క్లుప్తంగా

రన్ ఫర్ జీసస్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఇబ్రహీంపట్నం: గుడ్ ఫ్రైడే, ఈస్టర్‌ను పురస్కరించుకొని ఇబ్రహీంపట్నంలో శనివారం పాస్టర్లు, క్రైస్తవ నాయకులు 'రన్ ఫర్ జీసస్' సువార్త ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ.. ప్రపంచ శాంతికి శిలువ మరణం పొంది, తిరిగి మూడో రోజున సమాధిని జయించి లేచిన ఏసును ప్రభువుగా ప్రకటించడం ప్రతి క్రైస్తవ విశ్వాసి బాధ్యతని పేర్కొన్నారు. స్థానిక ఎంబీ గిల్గాల్ చర్చి వద్ద ర్యాలీ ప్రారంభమై.. పాత బస్టాండ్, అంబేడ్కర్ చౌరస్తా, బృందావన్ కాలనీ, ఎంబీఆర్ నగర్ మీదుగా మంచాల రోడ్డు వరకు కొనసాగింది. కార్యక్రమంలో క్రిస్టియన్ కోఆర్డినేటర్ చెరుకూరి రాజు, పాస్టర్స్ మండల అసోసియేషన్ అధ్యక్షుడు కరుణాకర్, దేవకుమార్, మధుకర్, సామెల్, ఇమ్మానియేల్, మనీల్, రాజు, సుదర్శన్, దేవదాసు, జీకే రావు, శ్రీహరిలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం



సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి

మాడ్గుల: దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ క్రియాశీల సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని సూచించారు. అనంతరం వీహెచ్‌పీ పిలుపు మేరకు బెంగాల్లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ.. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పెద్దయ్య యాదవ్, నాయకులు దార్ల అశోక్, దండు శ్రీను, వెంకటేశ్, రాంకిషన్, నిరంజన్ గౌడ్, మల్లేశ్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు స్థానిక సంస్థల్లో అవకాశం కల్పించండి



నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేసిన సంఘం నాయకులు

ఆమనగల్లు: స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు అవకాశం కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు ఆవుల వెంకటేశ్, ఎం.శ్రీనివాస్‌లు కోరారు. శనివారం వారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సలహాదారుడు వేమ్ నరేందర్‌రెడ్డిని నగరంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏఐసీసీ ఇచ్చిన హామీ మేరకు, స్థానిక సంస్థల్లో కో ఆప్షన్ సభ్యుల నియామకంలో అవకాశం ఇవ్వాలని కోరారు. దీనికి స్పందించిన వేమ్.. ఈ అంశం సీఎం దృష్టిలో ఉందని, దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుంటారని చెప్పినట్లు వారు వివరించారు.

బీఆర్‌ఎస్ సభకు..



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని బీఆర్‌ఎస్ ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్ కోరారు. శనివారం పట్టణంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన రజతోత్సవ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే సభకు పార్టీ శ్రేణులు తరలి రావాలని పిలుపునిచ్చారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్‌గౌడ్, నాయకులు రఘు, వెంకటయ్య, బాలస్వామి, వస్పుల సాయిలు, వెంకటేశ్, శివకుమార్, సైదులుగౌడ్, రమేశ్, యాదయ్య, ప్రసాద్, కిరణ్, భాస్కర్, రమేశ్, గోపి, రంజిత్ పాల్గొన్నారు.

ఎంపీ పరామర్శ

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు, చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండ్లి రాములును శనివారం నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి పరామర్శించారు. ఇటీవల రాములు మాతృమూర్తి జంగమ్మ మృతిచెందడంతో ఆమనగల్లు మండలం శంకరకొండతండాలో నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం జంగమ్మ చిత్రపటం వద్ద పూలమాల ఉంచి నివాళులు అర్పించారు. మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ ఉన్నారు.

వాగులో.. మురుగు!



పులందరి వాగులో పారుతున్న మురుగు

'పులందరి'లో ప్రవహిస్తున్న వ్యర్థజలాలు
- మురికి కూపంగా చెక్‌డ్యాం
- పట్టణంలోని వ్యర్థాలు ఇందులోకే..
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



ఎంపీపటేల్‌గూడ వద్ద పులందరి వాగులో కలుస్తున్న డ్రైనేజీ

ఇబ్రహీంపట్నం రూరల్: హైటెక్ సిటీగా అభివృద్ధి చెందుతున్న ఆదిబట్ల మున్సిపాలిటీలో రావిర్యాల నుంచి పారే పులందరి వాగు కలుషితమై పోయింది. మురుగుకు నిలయంగా మారింది. అయినప్పటికీ ఇరిగేషన్ అధికారులు, మున్సిపాలిటీ ఇంజినీరింగ్ విభాగం పట్టించుకోవడం లేదని పుర ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ వాగు పురపాలికలో పది కిలో మీటర్ల పొడవునా పారుతుంటుంది. ఆదిబట్ల, బొంగ్లూర్, ఎంపీపటేల్‌గూడ, మంగళ్‌పల్లి, మల్శెట్టిగూడ నుంచి అనాజ్‌పూర్ సమీపంలోని ఇందిర సాగర్ నుంచి మూసీలో కలుస్తుంది.

ఆలయ పరిసరాల్లో దుర్వాసన

నిత్యం నిండుకుండాలా పారే వాగుకు.. మహమ్మాయిదేవి ఆలయం వద్ద పులందరి చెక్‌డ్యాం ఉంటుంది. ఈ డ్యాంలో మురుగు జలాలు చేరి, తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో దీంతో ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఆలయ కోనేరు సైతం ఇందులో కలిసిపోవడం భక్తులను ఆందోళనకు గురిచేస్తోంది. గతంలో హనుమాన్ దేవాలయం కూడా ఈ కంపు బారిన పడగా.. పట్టణ ప్రజల చొరవతో అధికారులు పరిష్కార మార్గం చూపారు. మల్శెట్టిగూడ వద్ద ఉన్న చెక్‌డ్యాంలో 365 రోజులు నీరు ఉంటుంది. మురుగు కలయికతో ప్రస్తుతం మురుగు కూపంగా మారింది. ఇందులో పెరిగిన చేపలను తినడానికి మాంసం ప్రియులు వెనుకాడుతున్నారు.

కాలనీల మురుగంతా కాలువలోకే..

మున్సిపాలిటీలో కొత్తగా వెలుస్తున్న కాలనీల్లో సెప్టిక్ ట్యాంకుల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. కానీ వాటిని నిర్మించుకోకపోవడం, ఔట్‌పుట్‌లేకపోవడంతో కాలనీల నుంచి వెలువడే వ్యర్థ జలాలు నేరుగా కాలువలో కలుస్తున్నాయి. ఎంపీపటేల్ గూడ, మంగళ్‌పల్లి పట్టణాల మురుగు జలాలు కాలువలో కలవడంతో పులందరి వాగు మురుగు జలాలతో దర్శనమిస్తోంది.

సంరక్షించాలి



వర్షం వస్తే పులందరి వాగులో స్వచ్ఛమైన నీరు ప్రవహిస్తుంది. అలాంటి వాగు నేడు మురుగు కాలువలా మారింది. ఆదిబట్ల మున్సిపాలిటీ కార్యాలయం వెనక నుంచి మొత్తం మురుగే. ఎంపీపటేల్ గూడలో కూడా ఇదే పరిస్థితి. పాలకులు, అధికారులు స్పందించి వాగును సంరక్షించాలి.

– దొంకని కిషోర్‌గౌడ్, ఎంపీపటేల్‌గూడ

ఆలయం చుట్టూ మురుగే



మహమ్మాయి దేవాలయం చుట్టూ మురుగు పేరుకుపోయింది. ఎంపీపటేల్ గూడ నుంచి వచ్చే వ్యర్థ జలాలు ఇక్కడి పులిందర్ చెక్‌డ్యాంలో కలుస్తున్నాయి. వర్షాలు పడకపోవడంతో పాత నీరు అలాగే ఉండిపోయింది. కొత్త నీరు వస్తే పాతనీరు పోతుంది. కానీ ప్రస్తుతం ఇందులో మురుగు చేరి, దుర్వాస వస్తోంది. మురుగు కలవకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కొప్పు రాజశేఖర్, మంగళ్‌పల్లి

సంక్షేమంలో తెలంగాణ ఆదర్శం



కల్యాణలక్ష్మి లబ్ధిదారులతో ఎమ్మెల్యే కసిరెడ్డి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం 72 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఆయన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటుందని, దేశంలో ఎక్కడా లేనివిధంగా బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ బిల్లు తెచ్చిందని పేర్కొన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, సన్నవడ్లకు రూ.500 బోనస్ అందిస్తుందన్నారు. సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి చట్టం తదితర కార్యక్రమాలు ఆదర్శంగా నిలిచాయన్నారు. కాంగ్రెస్ పాలనలో నియోజకవర్గంలో గణనీయమైన ప్రగతి సాధించామని చెప్పారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి రాష్ట్ర సభ్యుడు బాలాజీసింగ్, నాయకులు ఆనంద్‌కుమార్, సురేందర్‌రెడ్డి, యాట నర్సింహ, గూడురు శ్రీనివాస్‌రెడ్డి, గుర్రం కేశవులు, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, జగన్, వస్పుల శ్రీకాంత్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంపై అసత్య ప్రచారం తగదు



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

కడ్తాల్: ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, కిషన్‌రెడ్డిలపై కాంగ్రెస్ నాయకులు అంజన్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు మహేశ్ మాట్లాడుతూ.. హెరాల్డ్ కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని, దీనిని కూడా రాజకీయం చేయడం కాంగ్రెస్ నాయకులకు తగదన్నారు. రాజ్యాంగాన్ని, చట్టాలను, కోర్టులను, చట్టబద్ధత కలిగిన ఈడీ, సీబీఐలను అవమానించే విధంగా మట్లాడటమే కాకుండా.. బీజేపీపై, ప్రధాన మోదీ, కేంద్ర మంత్రులపై అసత్య ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిలాల్‌నాయక్, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి భగీరథ్, నాయకులు శ్రీశైలం గౌడ్, వెంకటేశ్, సాయిప్రభు, విక్రమ్, రాజు, కరుణాకర్, అంజయ్య, మధు తదితరులు ఉన్నారు.

రజతోత్సవ సభకు తరలిరండి



మొయినాబాద్‌రూరల్: వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



చేవెళ్ల: ఆలూరులో..

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి

మొయినాబాద్‌రూరల్: వరంగల్‌లో ఈ నెల 27న జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంజనాదేవి గార్డెన్‌లో శనివారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ సభకు ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. గ్రామాల నుంచి రైతులు, ప్రజలను తరలించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలంతా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మాణిక్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సుధాకర్‌యాదవ్, మహేందర్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, రవి యాదవ్, అంజయ్యగౌడ్, విష్ణుగౌడ్, పరమేష్, ప్రవీణ్, జగన్ తదితరులు ఉన్నారు.

ఆలూరులో వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

చేవెళ్ల: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ కోరారు. మండలంలోని ఆలూరు గ్రామంలో శనివారం బీఆర్‌ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అధ్యక్షుడు కసిరే వెంకటేశ్, గ్రామ అధ్యక్షుడు షాబాద్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులతో కలిసి రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ ఫయూమ్, శ్రీనివాస్, ప్రభాకర్, కుమార్, పృథ్వీరాజ్, బాబు, నగేశ్, నర్సింలు, ఖదీర్, అమర్, బాల్‌రాజ్, నర్సింలు, హన్మంత్, వెంకటేశ్, గోపాల్, ప్రవీణ్, రాజు తదితరులు ఉన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

ఇబ్రహీంపట్నం: ఇటీవల ఇంటి ముందు ఉన్న గేటు కూలి ఓ చిన్నారి మృతి చెందగా, బాలుడి కాలు విరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. మృతురాలి తండ్రి ఎల్మినేడు గ్రామానికి బజారు భిక్షపతి మహేశ్వరం డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం డిపో మేనేజర్ లక్ష్మీసుధా, సీఐ అంజమ్మ, ఓఎస్ శేఖర్‌గుప్తా, ఏడీసీలు, సూపర్‌వైజర్లు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

పాడి రైతుల సమావేశం

యాచారం: మండల పరిధిలోని చౌదర్‌పల్లి రైతు వేదికలో శనివారం సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాడి రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు ప్రాముఖ్యత, పాడి పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన సౌకర్యాలపై చర్చించారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి రవినాథ్, విస్తరణ అధికారులు వసంత, రాధ, రైతులు కాశమల్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

పశు సంరక్షణకు ప్రత్యేక దృష్టి

కడ్తాల్: పాడి పశువులు రోగాల బారిన పడకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పశు సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల పశువైద్యాధికారి భానునాయక్ సూచించారు. మండల పరిధి ముద్విన్, చల్లంపల్లి, రావిచేడ్ గ్రామాల్లో శనివారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యుడు మాట్లాడుతూ.. వ్యవసాయ ఉత్పాదకతను గణనీయంగా ప్రభావితం చేసే గాలికుంటూ వ్యాధి ప్రబల కుండా జాగ్రత్త తీసుకోవాలని చెప్పారు. ఆయా గ్రామాల్లో 521 ఆవులు, 35 బర్రెలకు టీకా వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రైతులు ఉన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



పట్టాలతో విద్యార్థులు

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్‌లోని సన్‌రేస్ పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ(సెంట్రల్ క్రైం) మనోహర్, రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది మణిదీపికలు విద్యార్థులకు పట్టాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులది కీలక పాత్రని పేర్కొన్నారు. చిన్నారులకు చదువుతో పాటు వారికి ఆసక్తి ఉన్న అంశాల్లో తగిన శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలని సూచించారు. చిట్టి చేతులతో గ్రాడ్యుయేషన్ పత్రాలు అందుకున్న విద్యార్థులు.. ఆదే స్ఫూర్తితో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల వ్యవస్థాపకుడు గిరిధర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామమే లక్ష్యం



గ్రామస్తులకు జూట్ సంచులు అందజేస్తున్న అధికారులు, సంస్థ ప్రతినిధులు

ఇబ్రహీంపట్నం: ప్లాస్టిక్ రహిత గ్రామంగా ముకునూర్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యమని గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ వెంకటమ్మ, ఎంపీఓ రఘు, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్‌లు అన్నారు. రోటరీ క్లబ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం గ్రామస్తులకు జూట్ బ్యాగులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి పెను ప్రమాదమని, వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఇందుకు ప్రజల సహకారం చాలా అవసరమన్నారు. ప్రజలు ప్లాస్టిక్ కవర్లతో దుకాణానికి వెళితే రూ.1000లు, కవర్లలో సామగ్రి పెట్టి ఇచ్చినట్లయితే యజమానికి రూ.5 వేల జరిమాన విధిస్తామని హెచ్చరించారు. ఇదే అంశంపై ఇటీవల గ్రామ సభలో తీర్మానించామని గుర్తుచేశారు. అనంతరం జూట్ సంచులు పంపిణీకి సహకరించిన సత్యనారాయణరెడ్డిని అభినందించారు.

మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్

ఇబ్రహీంపట్నం: ఎస్ఎఫ్ఐ 5వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి శంకర్ కోరారు. స్థానిక పాషనరహరి స్మారక కేంద్రంలో శనివారం ఎస్ఎఫ్ఐ ఇబ్రహీంపట్నం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మంలో ఈ నెల 25,26,27 తేదీల్లో సభలు నిర్వహించనున్నామని, విద్యార్థులు తరలిరావాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని, సంక్షేమ గురుకుల హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, టీచర్ పోస్టులను భర్తీ చేయాలని, ఔట్ సోర్సింగ్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

నూతన కమిటీ..

ఎస్ఎఫ్ఐ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్ష్మణ్, కార్యదర్శులుగా ఎం.శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా వినయ్, వినోద్, సహాయ కార్యదర్శులుగా శ్రీహరి, మధు, సాయిని నియమించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మస్కు చరణ్, వంశీ, తరంగ్, శశివర్ధన్, విక్రమ్‌లు పాల్గొన్నారు.

అఘోరీపై చర్యలకు డిమాండ్



సీఐకి ఫిర్యాదు పత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

ఆమనగల్లు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అఘోరీ(అల్లురి శ్రీనివాస్)పై చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం ఆమనగల్లు అధ్యక్షుడు ఒగ్గు మహేశ్, సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీఐ జానకిరాంరెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని అవమానించేలా అఘోరి మాట్లాడారని, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకుముందు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఫిర్యాదు చేసిన వారిలో సంఘం సభ్యులు రమేశ్, బాలు, శ్రీశైలం, జంతుక అల్లాజీ, జంగయ్య, విజయ్, గిరి, కుమార్, అయోధ్య, తరుణ్, మహేశ్, అల్లాజీ తదితరులు ఉన్నారు.

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య



అవురుపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏంఈఓ సర్దార్ నాయక్

మండల విద్యాధికారి సర్దార్ నాయక్

మాడ్గుల: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, తమ పిల్లలను తల్లిదండ్రులు సర్కారు బడుల్లో చేర్పించాలని ఏంఈఓ సర్దార్ నాయక్ అన్నారు. శనివారం మండల పరిధి అవురుపల్లి గ్రామంలో ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటుకు దీటుగా సర్కారు బడుల్లో మౌలిక వసతులు ఉన్నాయని, శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో బోధన అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలు, రెండు జతల యూనిఫామ్స్ ఇవ్వడంతో పాటు అల్పాహారం, రాగిజావ, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత

ఆమనగల్లు: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం మన సొంతమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ఉదయనగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. పోషకాలపై అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చులో ఎక్కువ పోషకాలు లభించే ఆహార పదార్థాలు, కూరగాయలు, ఆకుకూరల గురించి వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రోజూ తీసుకునే ఆహారంతో పాటు చిరు ధాన్యాలు, పోషకాలు తీసుకోవాలని సూచించారు. చిన్నపిల్లలకు ఆరు నెలల వరకు తల్లి పాలు అందించాలన్నారు. ఈ సందర్భంగా సంపూర్ణ ఆరోగ్యం కోసం పోషకాహారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి మైమునాబేగం, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి, వైద్య సిబ్బంది లక్ష్మి, తిరుపతిరెడ్డి, నాగేశ్వరి, సీత, లక్ష్మి, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



భీంభరత్‌తో దైవాలగూడ గ్రామస్తులు

కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి భీంభరత్

షాబాద్: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని దైవాలగూడ గ్రామస్తులు భీంభరత్‌ను కలిసి తమ గ్రామానికి నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దైవాలగూడ గ్రామంలో అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. మండల ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శికి ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు జంగయ్య, భాస్కర్, విజయ్, యాదయ్య, నర్సింహులు, బాలయ్య, మురళి, శ్రీనివాస్, శివయ్య, రాఘవేందర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

షాద్‌నగర్: మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని 8వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఇసుక వ్యాపారులకు పట్టణంలో ప్రత్యేక స్థలం కేటాయించే విధంగా తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ సునీత, నాయకులు బాబర్‌ఖాన్, విశ్వం, బస్వం, ఇబ్రహీం, మోహన్, అప్పి, శేఖర్, జయప్రకాష్, శ్రీశైలం, కృష్ణవేణి, నాగమణి, విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.